

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3 జనగామ
మంగళవారం 12 మార్చి 2024





రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	మంగళవారం	సా : 6.31 గం..
సహర్ :	బుధవారం	ఉ : 5.04 గం..



టికెట్ టెన్షన్!

వరంగల్ అభ్యర్థిత్వాలపై తేల్చని ప్రధాన పార్టీలు

- ఒకటి రెండు రోజుల్లో జాబితాలు వెలువడే అవకాశం
- కాంగ్రెస్‌లో ఆశావహుల మధ్య తీవ్ర పోటీ
- బీఆర్ఎస్‌లో అరూరి లేదా కావ్యలో ఒక్కరికి చాన్స్
- బీజేపీలో ఆవిరైన జంపింగ్ ఆశలు

వరంగల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. అయితే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరో తేల్చలేక ప్రధానపార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. మహబూబాబాద్ అభ్యర్థులను తేల్చిన ప్రధాన పార్టీలు.. వరంగల్ అభ్యర్థిని ఎంపిక చేయటంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. దీంతో అన్ని పార్టీల్లోనూ టికెట్ టెన్షన్ కనిపిస్తోంది. ఇక కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి టికెట్ కోసం ఆశావహులు ఢిల్లీ, హైదరాబాద్‌ల్లోని తమ పార్టీ పెద్దల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఈ నేపత్యంలో కాంగ్రెస్ అధినాయకత్వం బలమైన అభ్యర్థి కోసం సర్వే చేయిస్తుండగా.. జంపింగ్‌లపై ఆశలు పెట్టుకున్న బీజేపీకి నిరాశే మిగిలింది. ఇక బీఆర్ఎస్‌లో తమకే టికెట్ ఇవ్వాలని ఉద్యమకారులు పట్టుపడుతుండగా, మరో ఇద్దరు కీలక నేతలు కూడా టికెట్ ఆశిస్తున్నారు. దీంతో వరంగల్ టికెట్ ఏ పార్టీలో ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ అన్ని పార్టీల్లోనూ నెలకొంది. అయితే త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ వస్తుందన్న ప్రచారం నేపథ్యంలో ఒకటిరెండు రోజుల్లో అన్ని పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

కాంగ్రెస్‌లో టెన్షన్.. టెన్షన్..

కాంగ్రెస్‌లో వరంగల్ ఎంపీ టికెట్ కోసం 42మంది దరఖాస్తు చేసుకోగా, మరో డజను మంది దరఖాస్తు చేసుకోనప్పటికీ టికెట్ కోసం అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే వరంగల్ ఎంపీ టికెట్ విషయంలో పరకాలకు చెందిన దొమ్మాటి సాంబయ్య పేరు దాదాపు ఖరారైందనే ప్రచారం జరిగింది. తొలి జాబితాలో సాంబయ్య పేరు లేకపోవటంతో సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయనే ప్రచారం జరుగుతోంది. జిల్లాకు చెందిన ఓ మంత్రి తాను సూచించిన వ్యక్తికే టికెట్ ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో టికెట్ ఆశిస్తున్న దొమ్మాటి సాంబయ్యతో పాటు శనిగపురం ఇందిర, రాగమళ్ల పరమేశ్వర్, సర్వే సత్యనారాయణ, అద్దంకి దయాకర్‌తో పాటు ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు, నలుగురు సీనియర్ కాంగ్రెస్ నేతలతోపాటు ఓ సీనియర్ జర్నలిస్టు పేర్లపై కాంగ్రెస్ ఫ్లాష్ సర్వే జరుపుతున్నట్లుగా సమాచారం. ఈ సర్వే ఆధారంగా ఎంపీ టికెట్ కేటాయించే అవకాశం ఉందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. శనిగరపు ఇందిర ఢిల్లీలోనే మకాం వేసి తనకే టికెట్ కేటాయించాలని, తమది తొలి నుంచి కాంగ్రెస్ కుటుంబం అని సోనియాగాంధీ, మల్లికార్జునఖర్గేలను కలిసి పది పేజీలతో కూడిన ఓ విజ్ఞప్తి పత్రం అందించారు. సాంబయ్య, రాగమళ్ల పరమేశ్వర్ కూడా అధిష్టానంపై ఒత్తిడి తెస్తుండటంతో టికెట్ ఎవరికి వస్తుందనే ఉత్కంఠ కాంగ్రెస్‌లో నెలకొంది. మంగళవారం లేదా బుధవారం కాంగ్రెస్ రెండో జాబితా విడుదల చేసే అవకాశం ఉండటంతో వరంగల్ అభయహస్తం ఎవరికి అనే చర్చ కాంగ్రెస్ కేడర్‌లో జరుగుతోంది.

బీజేపీ తేల్చేదెప్పుడో..?

బీజేపీ తొలుత తెలంగాణలో 9మంది ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది. కానీ, వరంగల్ ఎంపీ అభ్యర్థి ఖరారు చేయలేదు. ఇప్పటికే డజను మందికి పైగా బీజేపీ టికెట్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌ను బీజేపీలోకి చేర్చుకుని, ఆయననే బీజేపీ అభ్యర్థిగా ప్రకటిస్తారనే ప్రచారం జరిగింది. అయితే బీజేపీలో చేరేందుకు ఆరూరి ముందుకు రాకపోవటంతో బీజేపీ అభ్యర్థి ఎవరు అనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే మాజీ డీఐజీ టి.కృష్ణప్రసాద్ తనకే టికెట్ వస్తుందనే ధీమాతో వరంగల్ పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూ మద్దతు కూడకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కృష్ణప్రసాద్‌తోపాటు మరో ఆరడజను మంది బీజేపీ నేతలు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనే చర్చ కాషాయ పార్టీ లో జరుగుతోంది. బుధవారం బీజేపీ ఎన్నికల కమిటీ సమావేశం కానున్న నేపథ్యంలో రెండో విడతలోనైనా వరంగల్ సీటుపై బీజేపీ తేల్చుతుందా లేక చివరి వరకు నాన్చుడేనా అనే చర్చ కమలదళంలో జరుగుతోంది.

పార్టీలకు సవాల్‌గా..

వరంగల్ సీటు తమదే అని అన్ని పార్టీల్లోని ఆశావహులు ధీమాతో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సీట్లలో ఆరు చోట్ల కాంగ్రెస్ గెలిచింది. అయితే ఓటింగ్ పరంగా బీఆర్ఎస్, బీజేపీలు బలంగా ఉండటంతో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గెలుపు అంత సులభం కాదని తెలుస్తోంది. స్టేషన్‌ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్ విజయం సాధించగా, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి, పరకాల, పాలకుర్తిలో బీఆర్ఎస్ ద్వితీయ స్థానంలో నిలిచింది. వరంగల్ తూర్పులో బీజేపీ ద్వితీయ స్థానంలో ఉండగా, వరంగల్ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో అంచనాలకు మించి బీజేపీ ఓట్లను పొందింది. దీంతోపాటు లోక్‌సభ ఎన్నికలు కావడంతో ఓటరు నాడి కూడా మారుతుందనే అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో బరిలో బలమైన అభ్యర్థులను నిలిపితేనే విజయం సాధ్యమనే లెక్కల్లో పార్టీలున్నాయి.

మానుకోటలో పోటీకి రెడీ

వరంగల్ ఎంపీ అభ్యర్థుల కోసం కుస్తీ పడుతున్న పార్టీలు.. మానుకోటలో మాత్రం పోటీకి రెడీ అంటున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ మంత్రి బలరాంనాయక్ పేరును ఖరారు చేసింది. దీంతో బలరాంనాయక్ మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అవుతున్నారు. ఇక మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితకు మరోసారి బీఆర్ఎస్ అధిష్టానం అవకాశం ఇవ్వటంతో రెండోసారి ఎంపీగా కవిత బరిలోకి దిగుతున్నారు. ఇక ఇటీవలే మాజీ సీతారాంనాయక్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దీంతో సీతారాంనాయక్‌కు బీజేపీ టికెట్ దాదాపుగా ఖరారైందనే చర్చ పార్టీలో జరుగుతోంది. దీంతో మానుకోటలో మూడు ప్రధానపార్టీల అభ్యర్థులు ఖరారు కావటంతో ఇక పోటీకి సన్నాహాలు చేసుకుంటున్నారు.

గులాబీలో ఉద్యమ చిచ్చు

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీని మార్చటం దాదాపు ఖాయమనే చర్చ జరుగుతోంది. అయితే టికెట్ ఎవరికి అనేది ఉత్కంఠగా మారింది. ఇప్పటికే వరంగల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. అయితే స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాత్రం.. తన కుమార్తె కడియం కావ్యను రాజకీయాల్లోకి తీసుకవచ్చేందుకు ఇదే మంచి అవకాశంగా భావిస్తూ పావులు కదుపుతున్నారు. వరంగల్ ఎంపీ టికెట్ కావ్యకే ఇవ్వాలని అధిష్టానంపై కడియం ఒత్తిడి తెస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఆరూరి రమేష్‌కు ఎంపీ టికెట్ వస్తుందా? లేదా? అనే ఉత్కంఠ ఆయన అనుచరవర్గంలో నెలకొంది. అయితే ఎంపీ టికెట్ ఉద్యమకారులకే ఇవ్వాలని తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, బోడ డిన్నాలతో పాటు సిట్టింగ్ ఎంపీ పసునూటి దయాకర్ డిమాండ్ చేస్తున్నారు. దీంతో గులాబీ పార్టీలో ఉద్యమ సెగ పెరుగుతుండటంతో టికెట్ ఎవరికి అనే ఉత్కంఠ నెలకొంది.

భక్తిభావంతో అగ్నిగుండాలు

ఉత్సవమూర్తుల పల్లకీ మోసిన పద్మశాలీలు

సోమేశ్వరాలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



అగ్ని గుండాల నుంచి పల్లకీతో వెళుతున్న పద్మశాలి వాహనకారులు

పాలకుర్తి, మార్చి 11: శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ఐదు రోజుల పాటు జరిగిన స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం నిర్వహించిన అగ్నిగుండాలతో ముగిశాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయం ఆవరణలోని మెట్ల మార్గం వద్ద ప్రాతఃకాల సమయంలో అగ్ని గుండాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మశాలీలు ఉత్సవమూర్తుల పల్లకితో అగ్ని గుండాల నుంచి నడిచారు. ఆ తర్వాత వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు తడి వస్త్రాలతో అగ్ని గుండం నుంచి హరహర.. మహదేవా శంభో శంకర అంటూ నడిచి వెళ్లారు. వివిధ శాఖల అధికారులతో పాటు చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ అగ్ని గుండాల నుంచి నడిచి మొక్కులు చెల్లించారు. ఈ మహత్కార్యంతో శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయని ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై సాయి ప్రసన్న కుమార్, ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, వెంకటయ్య, కమిటీ సభ్యులు కృష్ణమాచార్యులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

ఈ కేవైసీ చేయించాలి: కలెక్టర్

జనగామ టౌన్, మార్చి 11: గ్యాస్ సబ్సిడీ వినియోగదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. సోమవారం ఆయన అడిషనల్ కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ఎంపీడీవో, మునిసిపాలిటీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ఆధార్ కార్డుతో గ్యాస్ సబ్సిడీకి లింక్ చేసుకోవాలన్నారు. నేడు(మంగళవారం) హైదరాబాద్‌లో సాయంత్రం 5 గంటలకు జరుగనున్న మహిళా సదస్సుకు ప్రతీ మండలానికి రెండు బస్సులు ఏర్పాటు చేసి 1300 మందిని తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇండ్లు కట్టివ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

జనగామ టౌన్, మార్చి 11: జనగామ మండలం పసరమడ్ల గ్రామంలో గ్రామకంఠం భూమిలో గుడిసెలు వేసుకున్న 200 మందికి పట్టాలిచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం మండల కార్యదర్శి బోడ నరేందర్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం మోకు కనకారెడ్డి మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం కట్టిస్తామని చెప్పి ఏ ఒక్కరికీ ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోనందుకే ఆ పార్టీని ప్రజలు గద్దె దింపారన్నారు. అదే తరహాలో కేంద్రంలో ఉన్న బీజేపీకి బుద్ధి చెబుతారని అన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రవీందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పోత్కనూరి ఉపేందర్, రామావత్ మీట్యానాయక్, బేజరబోయిన మల్లేశ్, ప్రసాద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నమ్మకం కలిగించాలి

ప్రజావాణిలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ టౌన్, మార్చి 11: ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలకు నమ్మకం కలిగించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు రెఫర్ చేయడంతో పాటు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీలను ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ప్రజలకు గ్రీవెన్స్‌కు వెళ్తే సమస్యలు పరిష్కారమవుతాయన్న నమ్మకం వచ్చేలా అధికారులు పనిచేయాలన్నారు. మొత్తం 90 దరఖాస్తులు రాగా.. ఇందులో ఎక్కువ శాతం రెవెన్యూ శాఖ పరిధివే ఉన్నట్లు అధికారులు తెలిపారు. బయ్యన్నవాగు రిజర్వాయర్ నిర్మాణంతో భూములు కోల్పోతున్న తమకు పరిహారం ఇవ్వాలని కోరుతూ కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామానికి చెందిన ముంపు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వారసత్వ భూమికి సంబంధించిన పాస్‌బుక్ ఇప్పించాలని కోరుతూ పాలకుర్తి మండలం విస్నూరు గ్రామానికి చెందిన జోగు కృష్ణ అర్జీ పెట్టుకున్నారు. జనగామ జిల్లా ఆస్పత్రిలో కొవిడ్ సమయంలో అనస్థీషియా టెక్నీషియన్‌గా 19 నెలలు పనిచేస్తే, తనకు కేవలం 6 నెలలు మాత్రమే జీతం ఇచ్చారని జనగామ పట్టణానికి చెందిన ఎండీ.పర్వేజ్ అర్జీలో తెలిపారు. బకాయి ఉన్న రూ.4లక్షల 55 వేలు ఇవ్వాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. తమ భూమిని తన పేరుపై రికార్డుల్లో నమోదు చేయాలని కోరుతూ రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి గ్రామానికి చెందిన బద్దిపడిగే సాంబశివారెడ్డి దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జనగామ ఆర్డీవో కొమురయ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న, డీఆర్‌డీవో మొగులప్ప, జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డీఏవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

మా స్థలం నుంచి వెళ్లగొడుతున్నారు..



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

బచ్చన్నపేట మండలం చిన్నరాంచర్ల గ్రామ పరిధిలోని గడీ బురుజు వద్ద 40 ఏళ్ల క్రితం స్థలం కొనుగోలు చేసి ఇండ్లు నిర్మించుకుని నివాసముంటున్న తమను స్థలం అమ్మిన వ్యక్తి ఇప్పుడు కాజేయాలని బెదిరిస్తున్నాడంటూ 11 మంది బాధితులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తమ తల్లిదండ్రులు 40 ఏళ్ల క్రితమే స్థలాలు కొని నివాసముంటున్నారని, ప్రభుత్వానికి ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నామని వారు చెప్పారు. కాగా, ధరణిలో తమకు భూమి విక్రయించిన వారికి ఇప్పటికీ రైతుబంధు డబ్బులు పడుతున్నాయని, దీనికి సాకుగా చూపి ఆ భూమి తమదేనంటూ భూమి విక్రయించిన వ్యక్తికి సంబంధించిన కుటుంబ సభ్యులు అంటున్నారన్నారు. రికార్డుల్లో వారి పేర్లను తొలగించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

ముత్తిరెడ్డి పట్టా రద్దు చేయించిండు..

- చల్లా మల్లారెడ్డి, పసరమడ్ల, జనగామ మండలం



మా తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు కావడంతో ప్రభుత్వం పసరమడ్ల గ్రామంలో రెండెకరాల భూమి ఇచ్చింది. అందులో మేము వ్యవసాయం చేసుకుంటున్నాం. మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆ భూమిని వదులుకోవాలని గతంలో బెదిరింపులకు దిగాడు. తన అధికారాన్ని ఉపయోగించి అధికారులతో పట్టా రద్దు చేయించాడు. తిరిగి నాకు పట్టా పాస్‌బుక్ ఇవ్వాలని కోరుతూ గత కలెక్టర్‌ను ఎన్నిసార్లు కలిసినా పట్టించుకోలేదు. కొత్త కలెక్టర్ నా సమస్య విని వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రోత్సాహకమేదీ?



అధికసాంద్రత గల పత్తిసాగును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- 2022లో అధికసాంద్రత పద్ధతిలో పత్తి సాగు
- ఎకరాకు రూ.4వేలు ప్రకటించిన ప్రభుత్వం
- రెండేళ్లయినా రైతులకు అందని నగదు
- నూతన ప్రభుత్వంపై ఆశలు
- జిల్లాలో వందల ఎకరాల్లో సాగు చేసిన రైతులు

నర్మెట, మార్చి 11: పత్తి సాగులో అధిక దిగుబడులను సాధించడంతో పాటు రైతులకు ఎక్కువ లాభాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయాలని సూచించింది. సాధారణ పత్తి సాగులో తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతున్నారని భావించి 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ విధానానికి శ్రీకారం చుట్టింది. అంతేగాకుండా ఈ పద్ధతిలో సాగు చేస్తే ప్రోత్సాహక నగదును కూడా అందిస్తామని ప్రకటించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వందల ఎకరాల్లో రైతులు అదే పద్ధతిలో పత్తి సాగు చేశారు కాని, ఇచ్చిన మాటను ఆచరణలో పెట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. సదరు రైతులకు ఇప్పటివరకు ప్రోత్సాహక నగదును అందించలేదు. పంట సాగు పూర్తై రెండేళ్లయినా ప్రోత్సాహకం అందకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నర్మెట మండలంలో 25 ఎకరాల్లో సాగు..

నర్మెట మండలంలో మూడు గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయించారు. బొమ్మకూరు, హన్మంతాపూర్, నర్మెట గ్రామాల్లో 14 మంది రైతులు 25 ఎకరాల్లో సాగు చేశారు. పత్తి సాగు చేసి క్షేత్రాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలపై సూచనలు సైతం ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా పత్తి సాగు పూర్తయి రెండేళ్లు పూర్తయినా ఇంతవరకు ప్రోత్సాహకం అందలేదు. సదరు రైతుల బ్యాంకు ఖాతాలు, సాగు చేసిన భూమి వివరాలు ఇప్పటికే సేకరించి ప్రభుత్వానికి నివేదించినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కొత్త ప్రభుత్వమైనా వెంటనే ప్రోత్సాహక నగదును ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు.



నర్మెటలో అధిక సాంద్రత పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు(ఫైల్)

మూడెకరాల్లో సాగు చేశాను..

- ప్రజ్ఞాపురం నరహరి, నర్మెట



మూడెకరాల్లో అధిక సాంద్రత పద్ధతి సాగు చేశాను. సాగు చేసినప్పుడు ఎకరానికి రూ. 4 వేలు ప్రోత్సాహకం ఇస్తామని వ్యవసాయ అధికారులు చెప్పారు. ఇప్పటివరకు ఎలాంటి నగదు రాలేదు. పత్తి పంట సాగు పూర్తయి రెండేళ్లు గడిచింది. ఇప్పటికైనా నగదును వెంటనే అందించాలి.

రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపించాం..

- డి.సంతోషి, ఏవో, నర్మెట



మండలంలోని మూడు గ్రామాల్లో అధిక సాంద్రత పద్ధతిలో రైతులు పత్తి సాగు చేశారు. వారి వివరాలను గతంలోనే ప్రభుత్వానికి పంపించాం. ఎంత మంది రైతులు, ఎన్ని ఎకరాలు సాగు చేశారు, వారి బ్యాంకు ఖాతాల వివరాలను కూడా పంపించాం. నిధులు రాగానే రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.

కాంగ్రెస్ అంటేనే కరువు

- మా పాలనలో ఎన్నడూ పొలాలు ఎండలేదు
- ఎకరానికి రూ. 20 వేలు పరిహారం ఇవ్వాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మైలారంలో ఎండిన వరిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి, మార్చి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా కరువు తాండవిస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. సోమవారం ఆయన మైలారం, బీక్యానాయక్ పెద్దతండాలో ఎండిన వరిపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో పాలకుర్తి నియోజకవర్గంలో పొలాలు ఎప్పుడూ ఎండిపోలేదని అన్నారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో అధికారులు సాగునీటిని అందిస్తున్నారని, పాలకుర్తి నియోజకవర్గంలో మాత్రం వరి పొలాలు ఎండిపోతున్నాయని అన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడానని, మూడు రోజుల్లో నీటిని విడుదల చేస్తామని చెప్పారని అన్నారు. ఎండిన పొలాలను అధికారులు సర్వే చేసి ఎకరానికి రూ. 15 వేల నుంచి రూ. 20 వేలు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మదార్, మాజీ సర్పంచులు యాకయ్య, లక్‌పతి, నాయకులు మాచెర్ల ఎల్లయ్య ఉన్నారు.

◆ దేవరుప్పుల: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం రామరాజుపల్లి, ధరావత్ తండా, ధర్మగడ్డ తండా, సీతారాంపురం, ధర్మాపురం గ్రామాల్లో ఎండిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓ రైతు ఆయన ఎదుట కంట నీరు పెట్టారు. రైతును ఓదార్చిన ఎర్రబెల్లి మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని, దేవాదుల ద్వారా నీటిని రప్పించి చెరువులు నింపిస్తానని భరోసా కల్పించారు. ఆయన వెంట బస్వ మల్లేషం, సుందర్‌రామిరెడ్డి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు ఉన్నారు.

గువ్వలేని పాటల గూడు

నేడు రచయిత కందికొండ యాదగిరి వర్ధంతి



హనుమకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ గీత రచయిత, కవి, కథకుడు కందికొండ యాదగిరి తెలుగు సినీ ప్రపంచానికి దూరమై అప్పుడే రెండేళ్లవుతోంది. ఆయన మృతితో గువ్వలేని పాట గూడు చిన్నబోయింది. పాటల ప్రపంచం మూగవోయింది. కథలు, కవిత్వాలతో తేజరిల్లిన సాహితీ లోకం నిస్తేజంగా మారింది. 20 ఏళ్ల సినీ ప్రస్థానంలో 1300లకుపైగా పాటలు రాసిన కందికొండ లేని లోటు ఇప్పటికీ పూడ్చలేదు. పుట్టిపెరిగిన నాగుర్లపల్లి.. యాదగిరి నిష్క్రమణ విషాదం నుంచి ఇంకా తేరుకోలేదు, మిత్రుల గుండెల్లో ఆయన జ్ఞాపకాలు ఇప్పటికీ పచ్చిగానే ఉన్నాయి. ఈనెల 12న కందికొండ యాదగిరి వర్ధంతి. ఈ సందర్భంగా ఆయన యాదిలో..

నాగర్లపల్లి వాసి..

కందికొండ స్వస్థలం వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లి గ్రామం. ప్రాథమిక విద్య సొంతూరులోనే పూర్తి చేశాడు. డిగ్రీ వరకు మహబూబాబాద్‌లో చదుకున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు సాహిత్యంలో ఎంఏ, పొలిటికల్ సైన్స్‌లో ఎంఏ చేశారు. కందికొండ తాను చదువుకునే రోజుల నుంచే పాటు రాయడం ప్రారంభించారు. తాను రాసిన పాటలు, కవితను తోటి విద్యార్థులతో పంచుకునేవారు. విద్యార్థి దశలో పాటతోటలో విహరించడం మొదలుపెట్టారు. అలా పాటే ఆయన ప్రాణమైంది. తర్వాత పాటతోనే జీవన ప్రయాణం సాగింది. అలా పల్లెలో పల్లవించిన కందికొండ పాట పరిమళం మెల్లిగా ఎల్లెడలా వ్యాపించింది.

క్యాన్సర్‌తో పోరాడి..

క్యాన్సర్ మహమ్మారి 49 ఏళ్ల వయసులోనే కందికొండను కబళించింది. 2022 మార్చి 12న హైదరాబాద్‌లోని తన నివాసంలో మరణించాడు. 2012లో ఆయనకు తొలిసారిగా క్యాన్సర్ నిర్ధారణ అయింది. అప్పట్లోనే సర్జరీ చేయించుకున్నారు. క్యాన్సర్‌ను జయించానుకున్నాడు. కానీ 2019లో అది మళ్లీ తిరగబెట్టడంతో చికిత్సలో భాగంగా చేసిన కీమోథెరపీ, రేడియేషన్ ప్రభావం వల్ల వెన్నెముక దెబ్బతిన్నది. అప్పటి నుంచి కందికొండ పూర్తిగా మంచానికే పరిమితమయ్యారు. కందికొండకు భార్య రమాదేవి, కుమార్తె మాతృక, కుమారుడు ప్రభంజన్ ఉన్నారు.

ఏపీలో చంద్రబాబుపై మరో కేసు

» అసైన్డ్ భూముల కేసులో ఏ-40గా చేర్చిన సీఐడీ

విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం మరో కేసు నమోదు చేసింది. ఇప్పటి వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫైబర్‌గ్రిడ్ కేసుల్లో నిందితుడిగా చేర్చిన సీఐడీ.. తాజాగా అసైన్డ్ భూముల కేసు ఎఫ్ఐఆర్‌లోనే గాక చార్జిషీటులోనూ నిందితుడి(ఏ-40)గా పేర్కొంది. రాజధాని అమరావతిలో వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం, రాయపూడి గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేశారని వరప్రసాదరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై మాజీ మంత్రి పి.నారాయణ, ఆయన కుటుంబ సభ్యులపై సీఐడీ గతంలో కేసులు (క్రైం నంబర్ 14/2020, 15/2020) నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్‌లలో ఎక్కడా చంద్రబాబు పేరు లేదు. ఇప్పుడు 14/2020 కేసులో ఆయనతో పాటు 22 మందిని నిందితులుగా పేర్కొంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం చార్జిషీటు, మెమో దాఖలు చేసింది. వీరిలో నారాయణ బంధువు పి.సుబ్రహ్మణ్యాన్ని ఏ-41గా చేర్చింది. వీరందరిపై ఐపీసీ 120బీ, 420, 506 రెడ్‌విత్ 120బీ సెక్షన్లు, అసైన్డ్ భూముల బదిలీ నిషేధం చట్టంలోని సెక్షన్ 7, ఎస్సీ ఎస్టీ చట్టంలోని 3(1)(జీ), (2)(వీఏ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2 కేసులకు సంబంధించి ఒకటే చార్జిషీటును కోర్టుకు సమర్పించారు. కాగా, యువగళం ముగింపు సభలో లోకేశ్ చేసిన రెడ్‌బుక్ వ్యాఖ్యలపై సీఐడీ వేసిన పిటిషన్‌పై విచారణ 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలుకు ఆయన తరఫు న్యాయవాది లక్ష్మీనారాయణ సమయం కోరారు. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో న్యాయాధికారి హిమబిందు విచారణను 21వ తేదీకి వాయిదా వేశారు.

నేటి నుంచే రంజాన్

(మొదటి పేజీ తరువాయి)

ముస్లింలు భావిస్తారు. అలాగే ఎంతో శుభప్రదమైన ఈ నెలలో నరకలోక ద్వారాలు మూసుకుని, స్వర్గలోకపు ద్వారాలు తెరుచుకుంటాయని వారు నమ్ముతారు. దేవునిపై విశ్వాసాన్ని, భయభక్తులను, భక్తిశ్రద్ధలను తెలుపుకునేందుకు ముస్లింలు రోజా (ఉపవాస దీక్షలు) పాటిస్తారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తూ ఐదుపూటలా నమాజు, ఇషా తరువాత తరావీహ్ (ప్రత్యేక ప్రార్థనలే)తో పాటు అర్ధరాత్రి పూట తహజ్జుద్ నమాజ్ పేరుతో ఏకాంత ఆరాధనలో లీనమవుతుంటారు. చివరి పది రోజులలో ఎతేకాఫ్ పాటిస్తారు. అలాగే ధనవంతుడైన ప్రతి ముస్లిం దాన ధర్మాలకు అధిక ప్రధాన్యమిస్తారు. తమ ఆస్తిలో రెండున్నర శాతం తీసి పేదలకు పంచిపెడతారు. నెల రోజుల అనంతరం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను ముగించి రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్)ను జరుపుకుంటారు. మరోవైపు రంజాన్ నెలవంక దర్శనంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని పాతబస్తీలో మటన్, చికెన్ షాపులు, కూరగాయల మార్కెట్‌లు, కిరాణా షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.



ముస్లింలకు సీఎం రంజాన్ శుభాకాంక్షలు

నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుందని అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ముస్లింల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించి, వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఆనాడు కేసీఆర్ పేషీలో
ఒక్క దళితుడున్నారా?

చిన్న సంఘటనపై బీఆర్ఎస్ విష ప్రచారం.. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, బీర్ల అయిలయ్య

హైదరాబాద్/న్యూఢిల్లీ/జగిత్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన పేషీలో ఒక్క దళితుడైనా ఉన్నారా అంటూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో జరిగిన చిన్న సంఘటనను చూపి ఏదో అయినట్లు బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు చేస్తోందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.. తెలంగాణ తొలి సీఎంగా దళితుడిని చేస్తానన్న కేసీఆర్.. చేశాడా అని ప్రశ్నించారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన ఎలా అవమానించిందీ ప్రజలే చూశారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు దళిత మంత్రులు ఎన్ని సార్లు కలవగలిగారని ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో పూర్వమున్న వసతులనూ సీఎం రేవంత్ కల్పిస్తున్నారని.. గుట్టలో నిద్రచేసే వెసులుబాటు, కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాట్లు చేశారని విప్ అయిలయ్య అన్నారు. కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కుతుందని చెప్పి.. డిప్యూటీ సీఎం భట్టికి అవమానం జరిగిందంటూ బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. భట్టి కూర్చున్న కుర్చీ చిన్నగా ఉన్నందు వల్ల అలా కనిపిస్తోందని వివరణ ఇచ్చారు. మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన కేటీఆర్‌కు.. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ అన్నారు. సీఎంను గురించి ఆయన పిచ్చిమాటలు మాట్లాడితే ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చేర్చడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ గురించి అనవసర వ్యాఖ్యలు చేస్తే హైదరాబాద్‌లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల్లో సీఎం రేవంత్‌కు ఉన్న ఆదరణ చూసి కేటీఆర్ ఓర్చుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. 'బిడ్డా కేటీఆర్.! మా సీఎం రేవంత్‌పైన మాట్లాడే స్థాయి నీకుందా? నీ భాష మార్చుకోక పోతే బట్టలు ఊడదీసి ఉరికిస్తం. నువ్వు మొగోనివైతే లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్లలో మెజారిటీ తెచ్చి చూపించు!'అని సవాల్ విసిరారు. రేవంత్ పట్ల కేటీఆర్ మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. కేసీఆర్ ఎక్కడ రాజకీయాలు మొదలుపెట్టి ఎక్కడ మంత్రి, డిప్యూటీస్పీకర్ అయ్యారో కేటీఆర్ చెప్పాలన్నారు. కేటీఆర్ ఇలాగే మాట్లాడితే తెలంగాణ ప్రజలు.. బీఆర్ఎస్‌కు ఉన్న ప్రతిపక్ష హోదా లేకుండా చేసి బయటకు పంపుతారన్నారు.



జగిత్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రెండ్రోజుల్లో గొల్లకురమల కార్పొరేషన్

గొల్ల, కురమల కార్పొరేషన్‌ను మరో రెండ్రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుతో గొల్ల, కురుమలకు లబ్ధి చేకూర్చుతుందన్నారు. గొల్ల కురమలకు బీఆర్ఎస్ పదేళ్ల పాటు అన్యాయం చేసిందని మండిపడ్డారు. గొల్ల కురుమలకు 4 అసెంబ్లీ సీట్లు కేటాయించి.. అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ నిలబెట్టుకుంటున్నారని వెల్లడించారు.

మోదీకి చిత్తశుద్ధి లేదు:వీహెచ్

ఓబీసీ ప్రధాని అని చెప్పుకొనే నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి బీసీలకు ఏం చెప్తారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ప్రశ్నించారు. కులగణన చేస్తామని ప్రకటించడానికి వస్తున్నారా? అని నిలదీశారు. ఓట్ల కోసం అయోధ్య రామమందిరం, కాశీ గురించి మాట్లాడడమే తప్ప బీసీల అభివృద్ధి పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో వీహెచ్ మాట్లాడుతూ.. కులగణన కోసం మోదీని ఓబీసీ ఎంపీల బృందం ఆధ్వర్యంలో నాలుగు సార్లు కలిసినప్పటికీ హామీ ఇవ్వలేదన్నారు. కాగా, జగిత్యాలలో ఇటీవల జరిగిన మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ రెబల్‌గా పోటీ చేసి విజయం సాధించిన అడువాల జ్యోతి లక్ష్మణ్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం జగిత్యాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

22 ఎకరాల నిషేధిత జాబితా భూమి..
ఎంపీ సంతోష్‌కు పట్టా

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. "సంతోష్ అనే బీఆర్ఎస్ ఎంపీ, వారి కుటుంబానికి చెందినవారి పేరుమీద కూడా భూములున్నాయి. అప్పటివరకు 22(ఎ) కింద నిషేధిత జాబితాలో ఉన్న భూమి వారి పేరిట పట్టా అయింది. ఆ గ్రామంలో అందరి భూములూ నిషేధిత జాబితాలో ఉంటాయి. కానీ, ఆయనకు మాత్రం ఆ 22 ఎకరాలు పట్టా అయిపోయింది" అని కోదండరెడ్డి అన్నారు. ఎంపీ సంతోష్ భార్య, ఓ ఎమ్మెల్సీ, ఇద్దరు ఆ పార్టీ నేతలు కలిసి ఒకే గ్రామంలో నిషేధిత జాబితాలో ఉన్న 22 ఎకరాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ నలుగురికి చెందిన ఒక కంపెనీ పేరుతో ఈ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఎలా పట్టాలుగా మార్చుకున్నారనేందుకు ఇది ఒక్క ఉదాహరణ మాత్రమేనన్నారు. ఇలాంటి రిజిస్ట్రేషన్లపై తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. మరోవైపు వివాదరహితంగా ఉన్న 23 లక్షల ఎకరాలను వివాదాస్పద భూముల కేటగిరీ(బీ)లో చేర్చారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనన్ని భూ కుంభకోణాలు ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో జరిగాయని ధ్వజమెత్తారు. ఎవరినీ సంప్రదించకుండా గతంలో దివాళా తీసిన విదేశీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు అప్పగించారని కోదండరెడ్డి తెలిపారు. ఆ తర్వాత ఇదే కంపెనీ టెరాసిస్, క్వాంటెల్లాగా పేర్లు మార్చుకుందని వివరించారు. ఈ మూడు కంపెనీలు రాష్ట్రానికి చెందిన రామలింగరాజు కుటుంబీకుడు శ్రీగారి శ్రీధర్‌రాజు పేరిట ఉన్నాయని తెలిపారు. రామలింగరాజు కుటుంబానికి కేటీఆర్‌తో అవినాభావ సంబంధం ఉందన్నారు. ధరణి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఆ శాఖ మంత్రిగా కూడా ఉన్న గత సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దీనికి ప్రధాన కారణమని కోదండరెడ్డి ఆరోపించారు. కేటీఆర్ తన కార్యాలయంలో ధరణికి సంబంధించి ప్రత్యేకంగా ఒక వ్యవస్థనే పెట్టుకున్నారని తెలిపారు.

17 వరకు స్పెషల్ డ్రైవ్..

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్‌ను మరో వారం రోజులపాటు పొడిగించారు. దరఖాస్తులు భారీగా వస్తున్నందున దీనిని ఈ నెల 17 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 2.45 లక్షల ధరణి దరఖాస్తులు పరిష్కారం దిశగా ఉన్నాయని తెలిపింది.

ప్రణీత్‌రావు ఎక్కడ?

- సిరిసిల్లలో పంజాగుట్ట పోలీసుల గాలింపు
- అదుపులోకి తీసుకున్నట్లుగానూ ప్రచారం?
- పథకం ప్రకారమే ట్యాపింగ్.. డేటా మాయం
- హార్డ్ డిస్కల ధ్వంసం కేసులో కీలక ఆధారాలు
- గత ప్రభుత్వ పెద్దల అండతో ఎస్ఐబీలో హవా
- ప్రతిఫలంగానే అడ్డదారిలో ఆయనకు పదోన్నతి?
- ప్రణీత్‌కు సహకరించిన అధికారుల్లో గుబులు

హైదరాబాద్ సిటీ, సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సస్పెండైన డీఎస్పీ ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు ఎక్కడ ఉన్నారనేది తెలియడం లేదు. ఫోన్‌లు స్విచ్ఛాఫ్ ఉండడంతో పాటు, అజ్ఞాతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తూ ఆయనను పట్టుకునేందుకు హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం వీరు సిరిసిల్ల వచ్చి స్థానిక శ్రీనగర్ కాలనీలో ప్రణీత్ అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద రాత్రి వరకు పహారా కాసినట్లు తెలిసింది. ఓ దశలో అదుపులోకి తీసుకున్నారని, రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఏ సమయంలోనైనా హైదరాబాద్ తరలించే అవకాశం ఉందని ఊహాగానాలు వచ్చాయి. అయితే, ప్రణీత్ విషయం తమకు తెలియదని, పంజాగుట్ట పోలీసులకే సమాచారం ఉంటుందని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పంజాగుట్ట పోలీసులు సైతం ప్రణీత్ ఇంకా దొరకలేదని చెప్పారు. హైదరాబాద్‌లోని స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీగా పనిచేస్తున్న ప్రణీత్ ఫిబ్రవరి 20న బదిలీపై సిరిసిల్ల డీసీఆర్బీలో చేరారు. రిపోర్టు చేసిన వెంటనే హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలిసింది. ట్యాపింగ్ ఆరోపణలతో ఈ నెల 5న సస్పెండయ్యారు. కాగా, ఎస్ఐబీ కార్యాలయంలో.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు ప్రతిపక్ష నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్ డిస్క్‌లను ప్రణీత్ ధ్వంసం చేశారని ఆదివారం అదనపు ఎస్పీ రమేష్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ప్రణీత్‌తో పాటు, మరికొందరిపై పంజాగుట్ట స్టేషన్‌లో ఐపీసీ 409, 427, 201, 120(బి), సెక్షన్(3) ఆఫ్ పీడీపీపీ యాక్ట్, 65, 66, 70 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి.

పథకం ప్రకారం ఎస్ఐబీకి.. 'అద్భుత పనితీరు'తో డీఎస్పీ

గత ప్రభుత్వంలోని పెద్దలతో దగ్గరి బంధుత్వం ఉండడం, వారి అండతో ప్రణీత్ పథకం ప్రకారం ఎస్ఐబీకి వెళ్లి చక్రంతిప్పినట్లు పోలీసులు కీలక సమాచారం సేకరించారు. 2007 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన 2018లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఎస్ఐబీకి మార్చగా ఆ విభాగం ఉన్నతాధికారుల తోడ్పాటుతో రెండు గదుల్లో ఇంటర్నెట్ కనెక్షన్‌తో 17 కంప్యూటర్లను అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు. వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా, అనధికారికంగా, చట్ట విరుద్ధంగా సేకరించడమే కాక స్వయంగా పర్యవేక్షించినట్లు కచ్చితమైన ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుసటి రోజే ఎస్ఐబీ కార్యాలయంలో సీసీ కెమెరాలు బంద్ చేయించి, టెక్నీషియన్ సాయంతో కంప్యూటర్లలోని డేటా, కీలక వివరాలు కాపీ చేసుకుని, హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసి కాల్చివేశారు. తనపై అనుమానం రాకుండా కొత్త హార్డ్ డిస్క్‌లను ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. కాగా, చెప్పినట్లు చేసినందుకు 'అద్భుతమైన పనితీరు' కింద నిరుడు మార్చిలో ప్రణీత్‌కు డీఎస్పీగా పదోన్నతి ఇచ్చారు. దీనిపై ఆయన బ్యాచ్‌మేట్స్, ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. మరోవైపు ట్యాపింగ్‌లో కొందరు అధికారులకూ పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రణీత్ తర్వాత వీరినీ విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం మేరకు ఈ కుట్రలో ఎవరి పాత్ర ఎంత..? అనేది దానిపై దర్యాప్తు చేస్తున్నారు. కేసు సంచలనంగా మారుతుండడంతో ప్రణీత్ కు సహకరించిన ఉన్నతాధికారుల్లో గుబులు మొదలైంది.

ఏపీలో బీజేపీకి 6 ఎంపీ, 10 అసెంబ్లీ సీట్లు

- 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీ
- 8 గంటలపాటు మూడు పార్టీల నేతల భేటీ

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో ఎవరికి ఎన్ని సీట్లు అనే అంశంపై టీడీపీ, జనసేన, బీజేపీ తుది నిర్ణయానికి వచ్చాయి. సోమవారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ ప్రతినిధులుగా కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఎంపీ వైజయంత్ పాండే సుమారు 8 గంటలు చర్చలు జరిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. అనంతరం... ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేయనున్నదీ వివరిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం... తెలుగుదేశం పార్టీ 17 పార్లమెంటు, 144 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుంది. జనసేన రెండు లోక్‌సభ, 21 అసెంబ్లీ స్థానాల్లో బరిలో దిగనుంది. ఇక... బీజేపీ ఆరు పార్లమెంటు, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుంది. పొత్తుల్లో భాగంగా బీజేపీ, జనసేనకు కలిపి 8 పార్లమెంటు, 30 అసెంబ్లీ స్థానాలను ఇవ్వాలని తొలుత భావించారు. ఇప్పుడు... అసెంబ్లీ స్థానాల సంఖ్య 31కి పెరిగింది. తొలుత జనసేనకు 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు సీట్లు ఇచ్చారు. బీజేపీతో పొత్తు అనంతరం జనసేన ఒక ఎంపీ స్థానాన్ని, 3 అసెంబ్లీ స్థానాలను త్యాగం చేయాల్సి వచ్చింది. టీడీపీ కూడా ఒక అసెంబ్లీ స్థానాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది.

వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి బెయిల్

- సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ఆంధ్రలో అడుగుపెట్టొద్దు
- రెండు పూచీకత్తులు సమర్పించాలి: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక నిందితుడు (ఏ-5) దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అధిక శాతం సాక్షులు ఉన్న ఆంధ్ర రాష్ట్రంలోకి సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ప్రవేశించరాదని స్పష్టం చేసింది. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్, రెండు పూచీకత్తులు సమర్పించాలని.. ప్రతి సోమవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. పిటిషనర్ సీబీఐ కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని.. దర్యాప్తునకు సహకరించాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం ఆదేశాలిచ్చారు. శివశంకర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గతేడాది సెప్టెంబర్లో హైదరాబాద్ సీబీఐ కోర్టు కొట్టివేసింది. ఈ హత్య కేసులో 2021 నవంబర్ నుంచి జైల్లో ఉంటున్నానని.. సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసి బెయిల్ మంజూరు చేయాలని ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ మేరకు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తే సీబీఐ లేదా సునీతారెడ్డి ఆయన బెయిల్ రద్దుచేయాలని కోరవచ్చంటూ విచారణను ముగించింది.

జేబీబీ పార్టీలో చేరిన కోడికత్తి శ్రీను

» అమలాపురం నుంచి ఎన్నికల బరిలోకి...

విజయవాడ(ఆంధ్రజ్యోతి), ముమ్మిడివరం, మార్చి 11: జనిపల్లి శ్రీనివాసరావు(కోడికత్తి శ్రీను) రాజకీయ రంగప్రవేశం చేశారు. సోమవారం ఆయన జై భీమ్‌రావ్ భారత్ పార్టీలో చేరారు. విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంక పెదపేటలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో సామాన్యులకు న్యాయం జరిగే వరకు తాను పోరాటం సాగిస్తానని ప్రకటించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా అవి సక్రమంగా అర్హులకు చేరడం లేదన్నారు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు.

మా కుటుంబం త్వరలోనే టీడీపీలోకి: మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో అద్భుతాలు జరుగడం ఖాయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసే విధంగా కృషిచేస్తానని తెలిపారు. సోమవారమిక్కడ ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు రాఘవరెడ్డితో కలిసి తాను పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

సీఎం సార్...
మా మొర ఆలకించండి!

- ఆర్ అండ్ బీలో సర్వీస్ రూల్స్ ఖరారు చేయండి
- సీఎం రేవంత్‌కు, మంత్రి కోమటిరెడ్డికి ఉద్యోగుల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ అంశాన్ని పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. గత ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దాంతో తమకు పదోన్నతులు వచ్చినా అవి తాత్కాలికమే కావడంతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్థాయి హోదాలోనే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆర్ అండ్ బీ లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌ను పరిష్కరిస్తే దాదాపు 300 నుంచి 400 మంది ఉద్యోగులకు పదోన్నతులు కలుగుతాయన్నారు. వాస్తవానికి ఆర్ అండ్ బీ పదోన్నతుల అంశం ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితాపై ఆధారపడి ఉన్నప్పటికీ సర్వీస్ రూల్స్ తేలితే కిందిస్థాయి పదోన్నతులు ఒక కొలిక్కి వస్తాయని ఉద్యోగులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో సర్వీస్ రూల్స్ పూర్తయ్యాయని, తమ శాఖలోనూ అందుకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయినా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయిందని పలువురు ఉద్యోగులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కాగా సర్వీస్‌రూల్స్‌ను ఖరారు చేస్తే ఆర్ అండ్ బీలో జరిగిన పునర్వ్యవస్థీకరణతో ఏర్పడిన కొత్త కార్యాలయాలకు సిబ్బంది పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

తవ్విన కొద్దీ బయటపడుతున్న
అక్రమ పౌరసత్వాలు!

» తాజాగా 125 పెరిగిన సంఖ్య.. 24 మంది అరెస్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విదేశీయులకు అడ్డదారుల్లో పౌరసత్వం ఇచ్చిన కేసులో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి.. నకిలీ గుర్తింపు, విద్య, ఇతర ధ్రువీకరణ పత్రాలు పొంది.. వాటి ఆధారంగా పాస్‌పోర్టులు పొందిన వారి సంఖ్య తొలుత 95గా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు అనుబంధంగా మరికొన్ని చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదవుతుండడం.. ఈ ముఠాలకు పశ్చిమబెంగాల్‌లోని ఫేక్ సర్టిఫికెట్ల గ్యాంగ్‌తో లింకులను సీఐడీ నిర్ధారించింది. కొత్తగా మరో 30 మంది ఇలా అక్రమంగా పాస్‌పోర్టులు తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో.. నకిలీ పత్రాలతో పౌరసత్వాన్ని పొందిన విదేశీయుల సంఖ్య 125కు చేరింది. చెన్నైకి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్ మురళీధరన్ రాధ ఈ కేసులో కీలకంగా వ్యవహరించినట్లు తేల్చారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తే.. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ కేసులో సీఐడీ ఇప్పటి వరకు 24 మందిని అరెస్టు చేసింది. విదేశాలకు వెళ్లినట్లు గుర్తించిన వ్యక్తుల వివరాలను ఇప్పటికే ఇమిగ్రేషన్, పాస్‌పోర్టు అధికారులు అందజేశామని, వారిని భారత్‌కు రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఐడీ అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు అరెస్టయిన వారిలో హైదరాబాద్‌కు చెందిన ఫేక్‌సర్టిఫికెట్ల తయారీదారుడు అబ్దుల్ సత్తార్, డి.అశోక్‌రావు, మరియప్పన్, మునీందర్, చాంద్‌ఖాన్, హబీబుల్లా జైలులో ఉండగా.. మిగతా వారు బెయిల్‌పై బయటకు వచ్చారు.

ఎంపీ టికెట్ ఇందిరకే ఇవ్వాలి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 11: కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ టికెట్ టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిరకు ఇవ్వాలని స్టేషన్‌ఘన్‌పూర్ మండల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు చింత జ్యోత్స్న కోరారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆమె మాట్లాడారు. మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి దళిత మహిళ అయిన ఇందిరకు ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో నిరాదరణకు గురైన కాంగ్రెస్ పార్టీని ఇందిర ఎంతగానో అభివృద్ధి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మండల నాయకురాలు వడ్లూరి మౌనిక, నారగోని పద్మ, మాజీ ఎంపీటీసీ గట్టు రమాదేవి, బత్తిని కవిత, బొట్ల కవిత, సుమలత, సుజాత, అండాలు, ఇందిర, ఎల్లమ్మ, ఎమ్డీ సాధిక పాల్గొన్నారు.

'దొమ్మాటి'కే ఇవ్వాలంటూ పూజలు

చిలుపూర్: వరంగల్ పార్లమెంట్ ఎంపీ టికెట్ దొమ్మాటి సాంబయ్యకే ఇవ్వాలంటూ చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు పూజలు చేశారు. సోమవారం ఆ పార్టీ జిల్లా నాయకుడు సాదం గట్టయ్య యాదవ్ నేతృత్వంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు స్వామివారిని దర్శించుకుని సాంబయ్య పేరిట అర్చన, అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడుగా ఉన్న సాంబయ్యను పార్టీ అధిష్ఠానం గుర్తించి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంబారి రాజేశ్వర్, నారగోని పరమేశ్వర్, ముక్కెర నరహరి, మారపాక దయాకర్, ఉద్దెమారి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నిబంధనలు పాటించాలి

సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్

చిలుపూర్, మార్చి 11: సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో నిబంధనలు పాటించాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం కృష్ణాజీగూడెంలో 3వ వార్డు నుంచి చక్రితండాకు వెళ్లే రోడ్డును గ్రామస్థులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులను ఎస్టిమేషన్ ప్రకారం చేపట్టకుండా, నివాస గృహాలకు ఇబ్బంది తలెత్తే విధంగా చేపట్టడం సరికాదన్నారు. మరోవైపు చక్రితండాకు వెళ్లేందుకు గాను దుర్గమ్మగుడి, మోడల్ కాలనీ నుంచి బీటీరోడ్డు వేసే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా ఆలోచించకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే సంబంధిత పీఆర్ అధికారులు గ్రామాన్ని సందర్శించి పాతరోడ్డు ఉన్న స్థలంలోనే యధావిధిగా రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూలమాటి శ్రీధర్, ఆవుల నరేష్, మొగులగాని శ్రీనివాస్, సాదం రాజమ్మ, ఉద్దెమారి వజ్రమ్మ, సాదం లక్ష్మి, ఆకునూరి ప్రమీల, సాదం చేరాలు, అయిలమ్మ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో జనగామ విద్యార్థి ప్రతిభ

జనగామ కల్చరల్, మార్చి 11: మార్షల్ ఆర్ట్స్‌లో జనగామ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. కిజామీ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ లో 8వ జాతీయ స్థాయి కుంగ్‌ఫూ అండ్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి మణికంఠ అండర్-14 బాలుర కటాస్ అండ్ స్పైరింగ్ విభాగంలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించాడు. మణికంఠ జిల్లా కేంద్రంలోని న్యూస్టార్ చైనీస్ కుంగ్ ఫూ కేంద్రంలో శిక్షణ పొందుతున్నాడు. ఈ సందర్భంగా మణికంఠను మాస్టర్లు గుగ్గిళ్ల దేవేందర్, మహ్మద్ సలీం పాషా తదితరులు అభినందించారు.

ఆహార భద్రత చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు

జనగామ టౌన్, మార్చి 11: ఆహార పదార్థాలకు సంబంధించిన నిర్వాహకులు ఆహార భద్రత చట్టాన్ని ఉల్లంఘించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలుంటాయని అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ హెచ్చరించారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ.. హోటళ్లు, డైరీ ఫామ్‌లు, బేకరీలు, స్వీట్ షాపులు, తదితర ఆహార సంబంధిత షాపుల నిర్వాహకులు తప్పసరిగా తమ వ్యాపారాన్ని ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు జారీ చేసే లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆహార పదార్థాల్లో నాణ్యత పాటించాలని, కల్తీ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా ఆహార కల్తీకి పాల్పడితే 91001 05795 నంబర్‌కు వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు సూచించారు.



కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా



కోర్టులో మహిళా న్యాయవాదులకు బహుమతులు అందజేస్తున్న జడ్జీలు



మల్కాపూర్‌లో మహిళా రైతు ప్రేమలతను సన్మానిస్తున్న డెయిరీ సభ్యులు

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

● కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ టౌన్, మార్చి 11: మహిళలు పొదుపు ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించడమే కాకుండా వ్యాపారవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. మహిళలు సాధికారత దిశగా అడుగులు వేయాలన్నారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలన్నారు. పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు మెమొంటోలు అందజేసి సత్కరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా మహిళల రక్షణకు పలు విభాగాలు చేస్తున్న కృషిని స్కిట్ ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, జడ్పీటీసీ దీపిక, సంక్షేమ అధికారి జయంతి, ఉద్యానవన అధికారి లత, బాలల పరిరక్షణ కమిటీ చైర్మన్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆటలపోటీల్లో గెలిచిన వారికి జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సందీప బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఇట్టబోయిన జ్యోత్స్న, నారం కల్యాణి, భవాని ఎదునూరి రేఖ, పుష్ప, రాధిక, స్వాతి పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో మహిళా పాడిరైతుకు సన్మానం

చిలుపూర్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ముల్కనూర్ డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ అన్నారు. సోమవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాపూర్‌లో మహిళా పాడి రైతులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 2023 సంవత్సరంలో ముల్కనూర్ డెయిరీ పరిధిలో అత్యధికంగా 22746 లీటర్ల పాలు పోసిన పోలేపల్లి ప్రేమలతను ఘనంగా సన్మానించి, ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించవచ్చని ఆమె స్పష్టం చేస్తూ, మహిళా రైతులు ప్రేమలతను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు శోభారాణి, కర్ర రమాదేవి, జమసాల రాజేశ్వరి, రజిత, పొన్నం సుజాత, నీరజ పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలి

కాంగ్రెస్ బచ్చన్నపేట మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి



బచ్చన్నపేటలో బాల్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

బచ్చన్నపేట, మార్చి 11: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బాల్‌రెడ్డిని సోమవారం మండల కేంద్రంలో పట్టణ అధ్యక్షులు కోడూరు మహాత్మాచారి ఆధ్వర్యంలో నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో సంపూర్ణ మెజార్టీ కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను తెలంగాణ ప్రజలు ఆపార్టీని నమ్మే స్థితిలో లేరన్నారు. గ్రామాల్లోని పార్టీ నాయకులను, కార్యకర్తలను కలుపుకుని ముందుకు వెళతానన్నారు. కార్యక్రమంలో నిడిగొండ శ్రీనివాస్, అల్వాల ఎల్లయ్య, అవదూత శ్రీనివాస్, ఇప్ప శ్రీధర్ రెడ్డి, బందారపు క్రాంతి, అల్వాల రమేశ్, కర్రె నరేష్, దాచేపల్లి రాజయ్య, అబ్బసాయిలు తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పుల మండలాధ్యక్షుడిగా యాదగిరి..

తరిగొప్పుల: కాంగ్రెస్ పార్టీ తరిగొప్పుల మండలాధ్యక్షుడుగా, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా పోతారం గ్రామానికి చెందిన వగలబోయిన యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆయనకు సోమవారం నియామక పత్రం అందజేశారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ 3 దశాబ్దాల నిస్వార్థ సేవకు పార్టీ అధినాయకత్వం తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయనను కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ఎడెల్లి శ్రావణ్ రెడ్డి, నాయకులు బ్యాంగి శివకుమార్, ముడికె కుమార్, దామెర లూక, పలుచని సుధాకర్, గోరంతల వీరన్న, నరేందర్ రెడ్డి, మంద చంద్రయ్య, మామిడాల కొమురయ్య పాల్గొన్నారు.

మునిసిపల్ ఫ్లోర్ లీడర్‌గా కల్యాణి..

జనగామ టౌన్: జనగామ మునిసిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా ఆరో వార్డు కౌన్సిలర్ వంగాల కల్యాణిమల్లారెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం ఆమెకు పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. వంగాల కల్యాణి మూడుసార్లు వరుసగా కౌన్సిలర్‌గా కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. ప్రజా సమస్యలపై ఆమె పోరాడుతున్నందుకు గుర్తింపుగా ఈ పదవి ఇచ్చినట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



ఈద్గా ప్రహరీ పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ సుధీర్ రెడ్డి

ఈద్గా ప్రహరీ పనులు ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 11: మండలంలోని తాటికొండ గ్రామంలో రూ.10లక్షలతో చేపట్టిన ఈద్గా ప్రహరీ నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం యాదవులకు సంబంధించిన మల్లన్నగుడి నిర్మాణ పనులను, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పనులను పారదర్శకంగా నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాపోలు మధుసూదన్ రెడ్డి, మారపాక రాములు, చాడ రాజ్‌కుమార్, కనకం గణేష్, ఎడమ కట్టమల్లు, ఐలోని సుధాకర్, ఐలోని రాజు, రమేష్, రవి, గుండె మల్లేషం, పాలకుర్తి నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

సైనికులను చట్టసభలకు పంపాలి

మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకుడు మాచర్ల భిక్షపతి



మాచర్ల భిక్షపతిని సన్మానిస్తున్న మాజీ సైనికులు

జనగామ టౌన్, మార్చి 11: దేశ రక్షణ కోసం సేవలందించిన మాజీ సైనికులకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇచ్చి చట్టసభలకు పంపివ్వాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ కర్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి కోరారు. సోమవారం జిల్లాకేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిర్ర రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సైనికులకు ఏ పార్టీ అండగా ఉంటుందో వారికే రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తాము మద్దతునిస్తామన్నారు. రాష్ట్రంలో సుమారు 5 లక్షల మంది మాజీ సైనికులు ఉన్నారని, వీరి సేవలు రాజకీయాల్లోనూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు. దేశం కోసం నీతి, నిజాయితీగా పనిచేసిన సైనికులు చట్టసభల్లో ఉంటే దేశం మరింత ప్రగతి సాధిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రతీ జిల్లాలో డిఫెన్స్ కాలనీ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం తక్కువ ధరలకు భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రిటైర్డ్ సైనికులు మాచర్ల భిక్షపతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనగామ శాఖ ప్రతినిధి ప్రవీణ్, మాజీ సైనికులు పాల్గొన్నారు.



శివునిపల్లి ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఎస్‌బీఐ ఎదుట సీపీఎం ధర్నా

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 11: రాజకీయ పార్టీల ఎన్నికల బాండ్ల వివరాలు తక్షణం బయట పెట్టాలని డిమాండ్ చేస్తూ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం సీపీఎం నాయకులు శివునిపల్లి ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొడెపాక యాకయ్య మాట్లాడారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు బాండ్ల వివరాలు మార్చి 6 వరకు ఎస్‌బీఐ యాజమాన్యం వెల్లడించాలన్నారు. బ్యాంకు కోర్టును 116 రోజుల గడువు కోరడాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా చేపట్టామన్నారు. ఎస్‌బీఐ డిజిటలైజ్ అయినా వివరాలు ఇవ్వడంలో జాప్యం చేయడం సరికాదన్నారు. బీజేపీ అవినీతి బయట పడుతుందనే ఇలా చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రాములమ్మ, భాస్కర్, పి.నాగేశ్, వి.సోమయ్య, టి.ఐలయ్య, జి.వెంకటేశ్, కె.రాజు, బి.రామచంద్ర, రాములు, ఎస్.రవి, ఎల్.శ్రీకాంత్, సంపత్, సురేష్, మనీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



ఘన్‌పూర్‌లో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 11: పేదలు ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ పథకం కింద 5 లక్షల రూపాయలు అందించే పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించిన నేపథ్యంలో స్టేషన్ ఘన్‌పూర్‌లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అదేవిధంగా పార్టీ అధినేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, రాష్ట్ర మంత్రుల ఫ్లెక్సీకి కొబ్బరి కాయలు కొట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు కె.సతీష్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీల్లో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ అమలు చేశారన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లు పథకం ప్రారంభించడం చరిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, మల్లేశం, జె.శ్రీనివాస్, క్రాంతి, ప్రసాద్, జానీ, ఎల్లేష్, నాగరాజు పాల్గొన్నారు.



తమ్మడపల్లి(ఐ)లో మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రడపాక సుదర్శన్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రూ.15.5 లక్షలతో శ్రీకారం చుట్టిన ఎంపీపీ

జఫర్‌గడ్, మార్చి 11: మండలంలోని తమ్మడపల్లి(ఐ)లో పలు అభివృద్ధి పనులకు జఫర్‌గడ్ ఎంపీపీ రడపాక సుదర్శన్ సోమవారం గ్రామస్థుల సమక్షంలో శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షల సీడీపీ నిధులతో సీసీ రోడ్ల పనులకు, మండల పరిషత్ నిధుల నుంచి రూ.3.5 లక్షలతో మినీ వాటర్ ట్యాంక్, రూ.2 లక్షలతో సైడు కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం సీడీఎఫ్, మండల పరిషత్‌కు సంబంధించిన మొత్తం రూ.17.5 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. పల్లెలు అభివృద్ధి చెందడం ద్వారానే దేశ ప్రగతి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ కార్యదర్శి అశ్విని, మాజీ ఉప సర్పంచ్ తుమ్మ రవి, గ్రామాభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు గాదె సుధాకర్, గంగుల భూపాల్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ మండల కమిటీ ఎన్నిక

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 11: పాస్టర్స్ ఫెలోషిప్ మండల నూతన కమిటీని సోమవారం డివిజన్ కేంద్రంలో జరిగిన పాస్టర్ల సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడిగా కందుకూరి దేవవరం, ఉపాధ్యక్షులుగా బి. సహోదర్, ఎన్. టెక్నా, ప్రధానకార్యదర్శిగా టి. ప్రవీణ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా కనకం జాన్, కోశాధికారిగా ఫిలిప్పు, సహాయ కార్యదర్శిగా కే.చార్లెస్, కార్యవర్గ సభ్యులుగా దానియల్, ప్రభుదేవ్, సేవక్, రవీందర్, శ్రీనివాస్‌లు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కేసీ జాన్‌బన్నీ, తిమోతి, కుమార్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

హంతకుడికి బెయిల్ ఇవ్వద్దంటూ..

తీగారంలో మహిళల ధర్నా



తీగారంలో ధర్నా చేస్తున్న మహిళలు

జఫర్‌గడ్, మార్చి 11 : ఓ వృద్ధురాలిని అతి కిరాతకంగా హత్య చేసిన హంతకుడికి బెయిల్ ఇవ్వవద్దంటూ జఫర్‌గడ్ మండలం తీగారంలో మహిళలు ధర్నా చేశారు. గత ఏడాది నవంబర్ 21న తీగారంలో ముస్కు రామనర్సమ్మ అనే వృద్ధురాలిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇదే గ్రామానికి చెందిన సింగిరెడ్డి రవి అనే వ్యక్తి కత్తితో గొంతుకోసి చంపాడు. అతడిని ఇదే నెల 23న పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో నిందితుడు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకుని బయటకు వస్తున్నాడన్న సమాచారంతో మహిళలు, గ్రామస్తులు ఏకమై సోమవారం తీగారం - స్టేషన్‌ఘన్‌పూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. నిందితుడికి బెయిల్ ఇవ్వవద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహళలు మాట్లాడుతూ రవి మతిస్థిమితం లేని వృద్ధురాలైన రామనర్సమ్మను అతి దారుణంగా చంపాడని, అలాగే గతంలో అతని భార్యను సైతం చంపి బావిలో పడేసి జైలు శిక్ష అనుభవించాడని అన్నారు. నేర చరిత్ర కలిగిన అతను బెయిల్‌పై గ్రామానికి వస్తే.. మళ్లీ ఏ నేరం చేస్తాడోనని గ్రామస్తులంతా భయాందోళన చెందుతున్నారన్నారు. గ్రామంలోకి అతడిని రానీయబోమని, ఒకవేళ వస్తే అతడిని వదిలిపెట్టే ప్రసక్తేలేదని గ్రామస్తులు స్పష్టం చేశారు.

ఆలయ నూతన కమిటీ నియామకం

దేవరుప్పుల, మార్చి 11: మండలంలోని కడవెండి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం వానకొండయ్య లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం నూతన కమిటీని ఆలయ అర్చకుడు సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పెద్ది రమేష్, ఉపాధ్యక్షుడుగా గంగరబోయిన మల్లయ్య, కార్యదర్శిగా భాషిపాక యాదగిరి, డైరెక్టర్లుగా దూదిగాని వెంకన్న, జీడి ఎల్లయ్య, గుమ్మడవెల్లి యాదగిరి, షైనాల రమేష్, పాతరబోయిన వెంకన్న, సుడిగెల కొంరయ్య, ఎండి. యాకూబ్‌పాష, జెర్రిపోతుల కిష్టయ్య, మూడ్ వీరన్న, బానోతు శ్రీనివాస్ ఎన్నికైనట్లు సంపత్‌కుమార్ తెలిపారు.

పెంబర్తి విశ్వకర్మ పరపతి సంఘం ఎన్నిక

జనగామ కల్చరల్, మార్చి 11: విశ్వకర్మ సహకార పరపతి సంఘం పెంబర్తి అధ్యక్షుడిగా కాలూరి మల్లికార్జునచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పెంబర్తిలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. మల్లికార్జున చారి ఆరు సంవత్సరాలుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. కాగా సభ్యులుగా రాగి బాలాచారి, కూర బుచ్చయ్య, రంగు లక్ష్మణ్, నర్సింహాచారి, కాలూరి ఆంజనేయ చారి, వీరన్న, మహేశ్వరాచారి, శ్రీను, వేణు, నవీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మల్లికార్జునాచారిని సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు: ఆర్ఐ

చిలుపూర్, మార్చి 11 : మండలంలోని చిలుపూర్ - రాజవరం వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కలువల శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం రాజవరం సమీపంలో ఉన్న వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను ఆయన స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక అవసరం ఉన్న వ్యక్తులు నిబంధనల మేరకు మైనింగ్ అధికారుల అనుమతితో తీసుకెళ్లాలని సూచించారు.

మొరం తరలింపును అరికట్టాలి: సీపీఐ

జఫర్‌గడ్, మార్చి 11: మండలంలోని ముగ్దుంతండా పరిధిలో దేవాదుల కాలువ మొరం (మట్టి)ను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, అధికారులు స్పందించి అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ముగ్దుంతండా పరిధిలో గ్రామ చివర వరద కాలువలో తీసిన మట్టిని అధికారుల అండదండలతో సదరు కాంట్రాక్టరు అమ్ముకుంటున్నాడని ఆరోపించారు. టిప్పర్లతో రాత్రి వేళల్లో యథేచ్ఛగా తరలిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బానోత్ దుర్గాసింగ్, మోతీలాల్, బుచ్చన్న నాయక్, వర్షన్, రమేశ్, దేవానాయక్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 221మంది గైర్హాజరు

జనగామ కల్చరల్, మార్చి 11: ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం జనరల్ విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు జరిగాయి. విద్యార్థులకు సెట్-ఎ ప్రశ్నాపత్రాన్ని అందించారు. 4767 మంది విద్యార్థులకు గాను 221 మంది గైర్హాజరు కాగా 4546 మందితో 95.36% విద్యార్థులు హాజరైనట్లు డీఐఈఓ భైరి శ్రీనివాస్ తెలిపారు. కాగా నర్మెటలో ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రఘునాథపల్లి, మార్చి 11: అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రఘునాథపల్లి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. నర్మెట మండలం మచ్చుపహాడ్, గండిరామారం, మరియపురం రేషన్ డీలర్లయిన విమలాదేవి, లక్ష్మయ్య, ఇన్నమ్మ నుంచి కొనుగోలు చేసిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఓ వాహనంలో తరలిస్తుండగా రఘునాథ్‌పల్లిలో వెహికిల్ అండర్ పాస్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్లగూడెంనకు చెందిన డ్రైవర్ గుగులోతు సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, హెడ్ కానిస్టేబుల్ సారంగం పాల్గొన్నారు.